సాక్షి
వైఎస్సార్ జిల్లా

శుక్రవారం । 27 । సెప్టెంబర్ । 2024



ఉత్సాహంగా ఫెన్సింగ్ పోటీలు
స్థానిక జార్జ్ కారొనేషన్ క్లబ్‌లో గురువారం జిల్లా స్థాయి ఎస్జీఎఫ్‌ఐ ఫెన్సింగ్ పోటీలను నిర్వహించారు. 100 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. -8లో



అటవీ భూమిని నిగ్గు తేలుస్తారా..!
అన్యాక్రాంతమైన భూమిని నిగ్గు తేల్చేందుకు అధికారులు సిద్ధమయ్యారు. గెజిట్‌లో కంటే సుమారు 140 ఎకరాల అటవీభూమి తగ్గడంతో అధికారులు ఈ సర్వే చేపట్టారు. -8లో

గరిష్టం/కనిష్టం
33.4/25.5

వాతావరణం
జిల్లాలో గురువారం 25.5 - 33.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు సంతాప సభ
కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరి రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంతాప సభకు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్, జిల్లాలోనే అఖిలపక్ష, వామపక్ష నాయకులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

29న చదరంగం పోటీలు
కడప స్పోర్ట్స్: కడప నగరం అలంఖాన్‌పల్లెలోని విస్డం పాఠశాలలో ఈనెల 29వ తేదీ ఆదివారం రాష్ట్రస్థాయి చదరంగం ఓపన్ ప్రైజ్‌మనీ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి బి. అనీస్‌దర్బారీ తెలిపారు. రూ.30వేలు నగదు బహుమతులు, ట్రోఫీలు, మెడల్స్‌ను విజేతలకు బహుమతులుగా అందజేయనున్నట్లు తెలిపారు. టోర్నమెంట్‌కు ఏపీ చెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరావు, సుమన్, ఫిడే ఆర్బిటర్‌లు గోపీనాథ్, వంశీ తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొనాలని సూచించారు. పూర్తి వివరాలకు 8341255151 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

దరఖాస్తు గడువు పొడిగింపు
కడప ఎడ్యుకేషన్: ఎన్‌ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్షకు దరఖాస్తుకు అక్టోబర్ 3వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్తు, మున్సిపల్, ఎయిడెడ్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో 8వ తరగతి చదవుతూ ఉండే విద్యార్థులు ఈ పరీక్ష రాయుటకు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ వెబ్‌సైట్‌లో లేదా డీఈఓ కార్యాలయంలో తెలుసుకోవాలని డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు.

నర్సింగ్ కోర్సులో శిక్షణ
కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలోని నిరుద్యోగ యువతులకు ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో హైదరాబాదులోని ప్రథమ్ హెల్త్ కేర్ శిక్షణ కేంద్రంలో రెండు నెలలపాటు నర్సింగ్ అసిస్టెంట్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ జిల్లా కో–ఆర్డినేటర్ సరితాసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. 18–30 ఏళ్లలోపు యువతులు ఇందుకు అర్హులని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం, డిప్లొమా లేదా ఏదైనా ఒకేషనల్ కోర్సు చేసి ఉండాలన్నారు. అభ్యర్థినిలు పదవ తరగతి మార్కులిస్టు, ఆధార్, మూడు పాస్‌పోర్టు ఫొటోలతో అక్టోబరు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9000203952 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

14 మండలాల్లో వర్షం
కడప అగ్రికల్చర్: అల్పపీడనం కారణంగా జిల్లాలో వరుసగా నాలుగో రోజూ వర్షం కురిసింది. గురువారం 14 మండలాల్లో వర్షం కురిసింది. వల్లూరులో అత్యధికంగా 13.8 మి.మీ వర్షం కురవగా చెన్నూరులో 11.2, కడపలో 10.8, కమలాపురంలో 7.2, చక్రాయపేటలో 10, మైదుకూరులో 4.2, సింహాద్రిపురంలో 3.8, వీఎన్‌పల్లిలో 3.6, ఎర్రగుంట్లలో 1.6, రాజుపాలెంలో 1.4, ఖాజీపేటలో 1.2, ప్రొద్దుటూరులో 1, చాపాడులో 0.4 మి.మీ వర్షం కురిసింది.

పశువైద్య కళాశాలలో ప్రవేశాలు
ప్రొద్దుటూరు: మండలంలోని గోపవరం వద్ద ఉన్న పశువైద్య కళాశాలలో గురువారం 2024–25 సంవత్సరానికి మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రవేశాలు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. 28వ తేదీ వరకు ప్రవేశాలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా మొత్తం 60 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించామన్నారు. వీరిలో 15 మంది వీసీఐ కోటా ద్వారా ప్రవేశం పొందారన్నారు. ఈనెల 28న ఓరియంటేషన్ క్లాసు లు నిర్వహిస్తామని, 30వ తేదీ నుంచి మొదటి సంవత్సరం విద్యార్థులకు క్లాసులు ప్రారంభమవుతాయని తెలిపారు.

ఆర్డీవోల బదిలీ
కడప కోటిరెడ్డి సర్కిల్/సెవెన్ రోడ్స్: రాష్ట్ర ప్రభుత్వం భారీగా రెవెన్యూ అధికారులను బదిలీ చేస్తూ గురువారం ప్రొసీడింగ్స్ జారీ చేసింది. కడపలో ఇంతకు మునుపు పని చేస్తున్న ఆర్డీఓ మధుసూదన్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఓఎస్డీగా వెళ్లడంతో గత కొంతకాలంగా ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఇపుడు కనిగిరిలో పనిచేస్తున్న జాన్ ఇర్విన్ ను కడప ఆర్డీవోగా నియమించారు. కడప తెలుగు గంగ యూనిట్ 2 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్‌ను బద్వేల్ ఆర్డీఓగా నియమించారు. జమ్మలమడుగులో పనిచేస్తున్న శ్రీనివాసులును జీఏడీలో రిపోర్ట్ చేసుకోవాలని సూచించారు. కాగా శ్రీకాకుళంలో పనిచేస్తున్న ఆదిమూలము సాయిశ్రీని జమ్మలమడుగు ఆర్డీవో గా నియమించారు. పులివెందుల ఆర్డీవో వెంకటేశును బదిలీ చేస్తూ జీఏడీలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించారు. ఆయన స్థానంలో లక్ష్మీ అన్నపూర్ణ ప్రత్యూషను నియమించారు. జీఎన్‌ఎస్‌ఎస్–2 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కౌసరబానును రామచంద్రాపురం ఆర్డీఓగా నియమించారు.

చదువులతో చెలగాటం


కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోంది. రోజుకో నిర్ణయంతో విద్యావ్యవస్థను గందరగోళంలో నెట్టేస్తోంది. తాజాగా ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్‌ఈ సిలబస్ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో పేద విద్యార్థులు.. వారి తల్లిదండ్రుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

- ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్‌ఈ విధానానికి బాబు సర్కారు స్వస్తి
- ప్రభుత్వ నిర్ణయంపై విద్యావేత్తల మండిపాటు
- నష్టపోనున్న వేలాది మంది విద్యార్థులు



సీబీఎస్‌ఈ సిలబస్ అమలులో ఉన్న కేజీబీవీ

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయిలో రాణించే విధంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్యనందించాలనే సంకల్పంతో అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారు. ఇందులో భాగంగానే కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి సీబీఎస్‌ఈ (సెంట్రల్‌బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) సిలబస్ అమలు చేశారు. దీంతో పేద, బడుగు, బలహీన వర్గాల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఆ ఆనందాన్ని మూడేళ్లకే ఈ కూటమి ప్రభుత్వం హరించిపచేసింది. ''కూలోడికి మగపిల్లాడ''అన్న చందంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలులో ఉన్న సీబీఎస్‌ఈ విధానాన్ని రద్దు చేయడంతోపాటు ఈ ఏడాది నిర్వహించబోయే పదవ తరగతి పరీక్షలను ఎస్‌ఎస్‌సీ బోర్డు విధానంలోకి మార్చుతూ ఉత్తర్వులు జారీ చేసింది. మూడేళ్లపాటు కష్టనష్టాలకు ఓర్చుకుని సీబీఎస్‌ఈ సిలబస్‌కు అలవాటు పడ్డ విద్యార్థులకు తాజా ప్రభుత్వ నిర్ణయం ఆశనిపాతంలా మారింది. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని విద్యావేత్తలు తీవ్రంగా ఖండించారు. ఇక విద్యార్థులు తల్లిదండ్రులు ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా శిక్షణ...
సీబీఎస్‌ఈ సిలబస్‌ను బోధించేందుకు జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా శిక్షణ కూడా ఇచ్చారు. శిక్షణలోని మెలకువలను గ్రహించి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధనలను సాగిస్తున్నారు. తీరా వ్యవస్థ గాడిలో పడిన తరువాత కూటమి ప్రభుత్వం సీబీఎస్‌ఈ సిలబస్ రద్దు నిర్ణయంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. దీంతోపాటు అకడమిక్ మధ్యలో ఈ నిర్ణయం తీసుకోవడంపై పలువురు తప్పు పడుతున్నారు. వారి మూడేళ్ల కష్టం బూడిదలో పోసిన పన్నీరేనా మండిపడుతున్నారు. పైగా ఇప్పటి వరకు సీబీఎస్‌ఈ సిలబస్‌ను చదువుకున్న విద్యార్థులకు తెలుగు, హిందీ సబ్జెక్టులపై పెద్దగా అవగాహన ఉండదు. ప్రస్తుతం ఆ రెండు సబ్జెక్టులతో పిల్లలు కుస్తీపడాల్సి వస్తుందని పలువురు ఉపాధ్యాయులు తెలిపారు.

నిరుపేద విద్యార్థులకు ఖరీదైన విద్య:
జిల్లా వ్యాప్తంగా 2022–23 విద్యా సంవత్సరంలో 31 ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్‌ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. అప్పట్లో ఈ విధానాన్ని 8వ తరగతి నుంచి ప్రారంభించారు. ఆపై 9వ తరగతి, ఆ తరువాత సంవత్సరం 10వ తరగతికి కొనసాగించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఎంపిక చేసిన పాఠశాలలోని విద్యార్థులు పదవ తరగతిలో సీబీఎస్ ఈ విదానంలో పరీక్షలను రాయాల్సి ఉంది. కానీ విద్యా సంవత్సరం ప్రారంభమైన మూడు నెలలు దాటిన తరువాత ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవడం పిల్లలకు శాపంగా మారనుంది. సాధారణంగా సీబీఎస్‌ఈ సిలబస్‌తో పది, ఇంటర్ పూర్తి చేస్తే జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చాటి కేంద్ర ప్రభుత్వ కొలువుల్లో సత్తాచాటే అవకాశం దక్కుతుంది.

మళ్లీ మొదటికి ప్రభుత్వ స్కూళ్ల పరిస్థితి....
కూటమి ప్రభుత్వం ఈ మూడు నెలల్లో తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో ప్రభుత్వ పాఠశాలలకు పరిస్థితి మళ్లీ మొదటికి రానుందనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్‌ఈ విధానంను రద్దు చేసిన కూటమి ప్రభుత్వం పేదల వ్యతిరేక సర్కారుగా ముద్ర వేసుకుంది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అసంబద్ధ నిర్ణయాలతో ప్రభుత్వ పాఠశాలలు మళ్లీ తిరోగమనం వైపు అడుగులు పడుతున్నాయని విద్యావేత్తలు మండిపడుతున్నారు.

సీబీఎస్‌ఈ వల్ల కలిగిన ప్రయోజనాలు ఇవే.....



విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు

- జిల్లాలోని 31 పాఠశాలల్లో సీబీఎస్‌ఈ చదివిన విద్యార్థులు దేశంలో ఎక్కడికి వెళ్లినా మంచి గుర్తింపు పొందేలా శిక్షణ పొందారు.
- ప్రముఖ విద్యా సంస్థలైన ఐఐటీలు, ఎన్‌ఐటీలు, ఎయిమ్స్, జిప్‌మర్, సీఎంసీ వంటి సంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ, నీట్ వంటివి సీబీఎస్‌ఈ సిలబస్‌లో తర్ఫీదు పొందారు.
- ఒత్తిడికి లోనవకుండా తన ఆసక్తికి అనుగుణంగా విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు.
- సీబీఎస్‌ఈ వల్ల ఏ రాష్ట్రానికి వెళ్లినా చదువుకు ఇబ్బంది లేకుండా కొనసాగించవచ్చనే ఆత్మస్థైర్యాన్ని పొందారు.
- నైపుణ్యాలను పెంపొందించుకుని ఈ విద్యా సంవత్సరంలో సీబీఎస్‌ఈ విధానంలో పది పరీక్షలు రాసేందుకు సిద్ధమయ్యారు.
- సీబీఎస్‌ఈ వల్ల విద్యార్థులు తమంతట తామే చదువుకోగలిగే నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్నారని తెలిపారు.
- సమస్యలను తనంతట తాను పరిష్కరించుకునే సామర్థ్యం విద్యార్థుల్లో పెంపొందిందని టీచర్లు చెబుతున్నారు.

సీబీఎస్‌ఈ ఎంతో ఉపయోగకరం



ప్రస్తుతం నడుస్తున్న పోటీ ప్రపంచంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సీబీఎస్‌ఈ విధానం ఎంతో ఉపయోగకరం. సీబీఎస్‌ఈ అమలయ్యే పాఠశాలల పర్యవేక్షణ కేంద్ర ప్రభుత్వం పరిధిలోకి వెళ్తుంది. సీబీఎస్‌ఈ విధానాన్ని ప్రభుత్వం కొనసాగించాలి.
- లెక్కల జమాల్‌రెడ్డి, పీఎస్‌టియూ రాష్ట్ర అధ్యక్షుడు.

అంతర్గత మూల్యాంకనానికి ప్రాధాన్యం ఇవ్వాలి



సీబీఎస్‌ఈ విధానంలో మాదిరిగా అంతర్గత మూల్యాంకన విధానానికి ప్రాధాన్యం ఇవ్వాలి. అలాగే అన్ని పాఠశాలల్లో 20 శాతం ఇంటర్నల్ మార్కుల వెయిటేజ్ ప్రవేశ పెట్టాలి. దీంతో విద్యార్థుల సమగ్ర మూర్తిమత్వాన్ని అంచనా వేయడానికి వీలు కలుగుతుంది.
- సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్ అమరావతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ

పేదల వ్యతిరేకిగా మారుతారు



సర్కారు బడుల్లో అమలవుతున్న సీబీఎస్‌ఈ విధానంను రద్దు చేయడం వల్ల కూటమి ప్రభుత్వం పేదల వ్యతిరేక ప్రభుత్వంగా మారుతుంది. సీబీఎస్‌ఈ విధానాన్ని రద్దు చేయడం వల్ల కూటమి ప్రభుత్వానికి ఏం ఒరుగుతుందో అర్థం కావడం లేదు.
- కేసీ బాదుల్లా, ఏఐటియూసీ, జిల్లా డిప్యూటి జనరల్ సెక్రటరీ

సీబీఎస్‌ఈ రద్దు సరికాదు



ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న సీబీఎస్‌ఈ సిలబస్‌ను ఉన్నట్లుంటి రద్దు చేయడం కూటమి ప్రభుత్వానికి సబబుకాదు. వీలైతే పాఠశాలలో విద్యాభివృద్ధికి కృషి చేయాలే తప్ప గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను రద్దు చేయడం సరైన నిర్ణయం కాదు. - డీఎం ఓబులేసు యాదవ్, గ్రేటర్ రాయలసీమ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

బాలగొండ గంగాధర్‌కు పర్యాటక ఎక్స్‌లెన్స్ అవార్డు




బాలగొండ గంగాధర్

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన చరిత్ర అధ్యాపకులు బాలగొండ గంగాధర్‌కు 2024 సంవత్సరానికి గాను రాష్ట్ర పర్యాటక శాఖ ఎక్స్‌లెన్స్ అవార్డును ప్రకటించింది. పర్యాటకంపై రాష్ట్ర స్థాయిలో ప్రస్తుత స్థితిగతులు, ఆర్థిక, సామాజిక ప్రభావం తదితర అంశాలపై ఆయన జాతీయ స్థాయిలో ప్రచురించిన పత్రాలు, పుస్తకాలకు ఈ బహుమతి లభించింది. గంగాధర్ జిల్లా పర్యాటక సంస్థలకు సుపరిచితులు. సుబ్బిరెడ్డి డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకులుగా పనిచేశారు. అనంతరం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కూడా సేవలు అందించారు. గంగాధర్ ప్రస్తుతం వేంపల్లె డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్నారు.

నేడు గండికోటలో ప్రపంచ పర్యాటక దినోత్సవం

కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప సెవెన్‌రోడ్స్: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి గండికోటలో ఘనంగా నిర్వహించనున్నామని కలెక్టర్ శివశంకర్ లోతేటి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవంలో భాగంగా గండికోటలో ఈక్వెస్ట్ ట్రైన్ ఫెసిలిటీ, చిల్డ్రన్స్ పార్క్, ఏటీఎం పార్కింగ్ ఏరియా, ఎంట్రెన్స్ గేట్ తదితర వాటిని ముఖ్య అతిథులు ప్రారంభిస్తారని తెలిపారు. అలాగే సాయంత్రం 5.30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి గండికోట లోగో లాంచ్ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జమ్మలమడుగు ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆదినారాయణ రెడ్డి, జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులు, జిల్లా అధికారులు హాజరుకానున్నారని తెలిపారు. ఈ ఉత్సవాలలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.



ఇకపై గండికోట... గ్రాండ్ క్యానియన్
కడప కల్చరల్: గండికోటను గ్యాడ్జి అనవద్దని, అది గ్రాండ్ క్యానియన్ అని కలెక్టర్ శివశంకర్ స్పష్టం చేశారు. దాదాపు అన్ని మాధ్యమాలలో గండికోట గురించి గాడ్జి అంటూ ప్రచురిస్తున్నారని, గండికోటను గ్రాండ్ క్యానియన్ అని పిలవాలని సూచించారు.

నేడు గండికోటకు ప్రత్యేక బస్సులు
కడప కోటిరెడ్డిసర్కిల్/జమ్మలమడుగు: పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం గండికోటకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని ఏపీఎస్ ఆర్టీసీ పర్సనల్ ఆఫీసర్ ధనలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. కడప నుంచి ఉదయం 9, మధ్యాహ్నం 12.00 గంటలకు స్పెషల్ సర్వీసులను నడుపుతున్నామని పేర్కొన్నారు. తిరుగు ప్రయాణంలో రాత్రి 7.30 గంటలకు ఈ బస్సులు బయలుదేరుతాయన్నారు. అలాగే జమ్మలమడుగు నుంచి గండికోటకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గంటకో బస్సు సర్వీసు నడపనున్నట్లు ఆమె వివరించారు.


ప్రతి స్థాయిలో పరిశుభ్రత పాటించాలి

కడప సెవెన్‌రోడ్స్: వ్యక్తిగత స్థాయి నుంచి గ్రామ, మండల, జిల్లా స్థాయి వరకు పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి పిలుపునిచ్చారు. గురువారం రాష్ట్ర పిలుపులో భాగంగా కలెక్టరేట్ సముదాయంలో ఉద్యోగులు స్వచ్ఛతా హీ సేవలో పాల్గొన్నారు. పరిసరాల్లో ఉన్న ముళ్ల పొదలు, ప్లాసిక్ వస్తువులు, చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రపరిచారు. జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఓ విజయ్‌కుమార్, ఐఅండ్‌పీఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, హౌసింగ్ పీడీ పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ల పరిశీలన
కలెక్టరేట్ కార్యాలయ పరిధిలో ఉన్న ఈవీఎం గోడౌన్లను గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ శివశంకర్ పరిశీలించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్లను తనిఖీ చేశామని కలెక్టర్ తెలిపారు.

ఐపీ... రైతన్నకు తలనొప్పి!

- గోదాముల యజమానుల ఐపీలు
- బెంబేలెత్తుతున్న రైతులు



జమ్మలమడుగు: రైతులకు అడుగడుగునా ఆటంకాలే కలుగుతున్నాయి. సాగు చేసిన పంట చేతికందేదాక లెక్కలేనన్ని గండాలు దాటాలి. తీరా చేతికందిన పంట అమ్ముడుపోవాలంటే సరైన ధర రావాలి. అంతవరకు గోదాముల్లో దాచుకుంటే.. అక్కడా కొత్త తలనొప్పులు ఎదురవుతున్నాయి. గోదాముల యజమానులు పెడుతున్న 'ఐపీ' బాంబులు బెంబేలెత్తిస్తున్నాయి. జమ్మలమడుగు నియోజకవర్గ పరిధిలో ఇటీవల కొందరు ప్రైవేటు గోదాముల యజమానులు ఐపీ పెట్టి రైతులకు చుక్కలు చూపెడుతున్నారు. గోదాముల్లో రైతులు అనామత్తుకింద(నమోదు చేయకుండా) దించుకున్న ధాన్యాలను పలువురు గోదాముల యజమానులు తమ అవసరాలకు అమ్ముకుంటూ రైతులకు కుచ్చుటోపి పెడుతున్నారు. ఈ విషయమై గోదాముల యజమాన్ని ప్రశ్నిస్తే అసలుకే మోసం వస్తుందేమోనన్న భయంతో పలువురు రైతులు మిన్నకుండిపోతున్నారు. ఎలాగోలా యజమానికి అనుకూలంగా ఉంటూ సొమ్ములను రాబట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారే తప్పా.. తమ ధాన్యాన్ని అమ్ముకున్నాడని అధికారులకు గట్టిగా ఫిర్యాదు చేయలేని పరిస్థితిలో ఉన్నారు. కష్టపడి పండించిన పంటలకు సరైన మద్దతు ధర వచ్చే వరకు రైతులు గోదాముల్లో దాచుకుంటారు. ఆయా యజమానులు తమ అవసరాలకు ఎవరి ధాన్యాన్ని అమ్మేసుకుంటున్నారో.. ఎంత అమ్ముతున్నారో.. ఎంతకు అమ్ముకుంటున్నారో తెలీడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరిపడా ప్రభుత్వ గోదాములు లేకే ఈ పరిస్థితి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు గోదాములపైనా ప్రభుత్వ పర్యవేక్షణ ఉంటే ఎంతోకొంత మేలు జరుగుతుందని కొందరు డిమాండ్ చేస్తున్నారు.



పెద్దపసుపల గోదాముల్లో రికార్డులను పరిశీలిస్తున్న రైతులు

మూడునెలల్లోనే ఇద్దరు...
జమ్మలమడుగు నియోజకవర్గంలో మూడు నెలల్లో ఇద్దరు గోదాము యజమానులు బాకీదారులకు 'ఐపీ' నోటీసులను పంపించగా.. మరో గోదాము యజమాని మాత్రం అనామత్తులో ఉన్న సరుకులను ఎంచక్కా అమ్ముకుని రైతులకు టోపీ పెట్టాడు. ఇటీవల పెద్దముడియం మండలం పెద్దపసుపల గ్రామంలో రామస్వామి అనే గోదాము యజమాని అప్పులు ఇచ్చిన వారికి ఈనెల 16వ తేదిన ఐపీ నోటీసులను పంపించారు. దీంతో రైతులు, బాకీదారులు షాక్‌కు గురయ్యారు. అదేవిధంగా కొండాపురం మండలం కేంద్రంలోని ఓ గోదాము యజమాని అనామత్తులో గోదాములో దాచిన రైతుల ధాన్యంలో 37మంది రైతులకు సంబంధించిన 3550క్వింటాళ్ల శనగలను అమ్ముకున్నాడు. ఇంకా గోదాముల్లో ఉన్న సరుకు ఉందా లేదా అంటూ రెండు నెలల క్రితం చుట్టుపక్కల గ్రామాల రైతులు, ఇతర నియోజకవర్గాలలో ఉన్న రైతులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతోపాటు జమ్మలమడుగు డీఎస్పీ యశ్వంత్ వద్ద పంచాయతీ పెట్టారు. అప్పట్లో డీఎస్పీ రైతులకు కచ్చితంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఇంతవరకు రైతులకు న్యాయం జరిగినట్లు దాఖలాలు లేవు.

వ్యవసాయాధికారుల పర్యవేక్షణ ఉండాలి



ధాన్యాన్ని నిల్వ ఉంచుకోవడానికి సరైన ప్రభుత్వ గోదాములు లేకపోవడంతోనే ప్రైవేట్ గోదాములను రైతులు ఆశ్రయించడం జరుగుతోంది. దీంతో గోదాము యజమానులు డబ్బులు అవసరమైనప్పుడల్లా రైతులకు సంబంధించిన ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. ఐపీలు పెడుతున్నారు. ప్రైవేట్ గోదాములలో దాచిన ధాన్యానికి రైతులకు మాత్రమే బ్యాంకులు రుణాలను ఇవ్వాలి. గోదాముల నిర్వాహణపై వ్యవసాయాధికారుల బాధ్యత కూడ ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.
–సుబ్బారెడ్డి, రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు.

మాకు స్టాక్ వివరాలను మాత్రమే పంపుతారు
ప్రైవేట్ గోదాములపైన మాకు పెత్తనం ఉండదు. కేవలం ఆ గోదాములలో స్టాక్ ఎంత ఉందో మాత్రమే వివరాలను మార్కెట్ యార్డుకు సమర్పిస్తారు. గోదాముల బాధ్యత పూర్తిగా వాటి యజమానులే చూసుకుంటారు. నియంత్రించే బాధ్యత మాకు లేదు.
–నాగిరెడ్డి, మార్కెట్‌యార్డు కార్యదర్శి, జమ్మలమడుగు

జిల్లాలోని పలువురు సబ్ రిజిస్ట్రార్ల బదిలీ

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పనిచేస్తున్న రిజిస్ట్రార్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కడప జాయింట్–1 సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లను అన్నమయ్య జిల్లా బి.కొత్తకోటకు.. జాయింట్–2 సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న లక్ష్మీదేవిని తిరుపతి అర్బన్‌కు బదిలీ చేశారు. సిద్దవటం సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న రాజా చంద్రమౌళిని నంద్యాల జాయింట్–2 సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. కడప జాయింట్–2 సబ్ రిజిస్ట్రార్‌గా బి.హరికృష్ణ, రూరల్ సబ్ రిజిస్ట్రార్‌గా ఎస్.నజీర్, సిద్దవటంకు శ్రీనివాసమూర్తి, పులివెందుల చంద్రమోహన్, ముద్దనూరు జీవీ రత్నమ్మ, బద్వేలుకు విద్యాసాగర్ రెడ్డి, మైదుకూరుకు దూదేకుల మహబూబ్‌బాషా, జమ్మలమడుగుకు మహమ్మద్ అజీబుల్లా, కమలాపురానికి డి.మహబూబ్‌బాషా, ప్రొద్దుటూరు జాయింట్–1కు జీఎన్‌జే రామదాసు, ప్రొద్దుటూరు జాయింట్–2 సబ్ రిజిస్ట్రార్‌గా బి.పార్వతిలను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కడప జాయింట్–1, వేంపల్లె సబ్ రిజిస్ట్రార్లుగా ఎవరినీ నియమించకపోవడం గమనార్హం.

క్లుప్తంగా

సిలిండర్లు, ఫిల్లింగ్ మిషన్లు అపహరణ

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని పార్నపల్లె రోడ్డు సమీపంలో ఉన్న గంగిరెడ్డి ఫ్యాక్టరీలో బాషా అనే వ్యక్తి నన్నారి ఫ్యాక్టరీ నడుపుతున్నాడు. గురువారం నన్నారి ఫ్యాక్టరీలో దొంగలు పడి 8 సిలిండర్లు, ఫిల్లింగ్ మిషన్‌తో పాటు మూడు మోటార్లను అపహరించి తీసుకెళ్లారు. వీటి విలువ సుమారు రూ.14 లక్షలు ఉంటుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

నీటిపారుదల శాఖలో బదిలీలు

కడపసిటీ : వైఎస్సార్ జిల్లా నీటిపారుదల శాఖ పరిధిలో గురువారం బదిలీలు జరిగాయి. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కడప క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈగా ఉన్న శారద తిరుపతి సీఈ కార్యాలయంలో ఎస్ఈ (డిజైనింగ్, క్వాలిటీ కంట్రోలర్)గా బదిలీ అయ్యారు. అలాగే కడప సీఈ కార్యాలయంలో డిజైన్ ఈఈగా ఉన్న శేషబాబును బద్వేలు టీజీపీలో ఈఈగా బదిలీ చేశారు. కడప జీఎన్ఎస్ఎస్‌లో పనిచేస్తున్న సాయిరాం ప్రసాద్‌ను అన్నమయ్య జిల్లా డిస్ట్రిక్ట్ వాటర్ రీసోర్స్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. కమిషనర్ ఆఫ్ టెండర్స్ నుంచి మధుప్రసాద్‌రెడ్డిని కడప ఈఈ (డిజైన్స్)గా బదిలీ చేశారు. త్వరలో వీరంతా ఆయా ప్రాంతాలకు వెళ్లి బాధ్యతలు స్వీకరించనున్నారు.

నేతన్న నేస్తం తిరిగి ప్రవేశ పెట్టాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్రంలో నేతన్న నేస్తం పథకాన్ని తిరిగి ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30వ తేదీ కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి జిల్లా నుంచి చేనేత కార్మికులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున పిలుపు నిచ్చారు. గురువారం నగరంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆయన విడుదల చేశారు. గతంలో ఈ పథకాన్ని రాష్ట్రంలో 73 వేల మందికే పరిమితం చేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర పిలుపులో భాగంగా చేపడుతున్న ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నగర అధ్యక్షుడు జయరాములు, నాయకులు నూకల పెంచలయ్య, బీసీ మహాసభ అధ్యక్షుడు పీవీ రమణ, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఖరీఫ్ ముగుస్తున్నా ఎదురు చూపులేనా..!

- అన్నదాత సుఖీభవ నిధుల విడుదల ఎప్పుడో..
- సాగు పెట్టుబడికి అప్పులు చేసుకుంటున్న రైతన్నలు
- తీవ్ర వర్షాభావంతో పలు చోట్ల దెబ్బతిన్న ఖరీఫ్ ఆరుతడి పంటలు
- కొత్త ప్రభుత్వం కొలువుదీరి 100 రోజులైనా అందని సాయం
- ఏడాదికి రూ. 20 వేలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం
- పీఎం కిసాన్ సమ్మాన్ నిధులు రైతుల ఖాతాలకు జమ అయ్యేది ఎప్పుడు
- మరో వారం రోజుల్లో రబీ సీజన్ కూడా ఆరంభం
- గత ప్రభుత్వ హయాంలో రూ.1191.30 కోట్లు రైతులకు లబ్ధి



రబీసాగు సన్నద్ధత కోసం ట్రాక్టర్‌తో సేద్యం చేస్తున్న రైతు

కడప అగ్రికల్చర్ : ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా రైతులకు సాగు సాయం కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. మరో వారం రోజుల్లో ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ సీజన్ కూడా ఆరంభం కానుంది. కానీ రైతులకు పంట సాగు కోసం అందిస్తామన్న సాగు సాయం మాత్రం కూటమి ప్రభుత్వం ఇంతవరకు అందించలేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నాలుగు నెలలు గడిచినా ఇంతవరకు అన్నదాత సుఖీభవ పథకం ఊసే లేదు. కూటమి ప్రభుత్వ పాలనలో అన్నదాతలకు అప్పులు తప్ప ఆదాయం లేదని పలువురు రైతులు అంటున్నారు.

ఎన్నో ఆశలతో ఖరీఫ్ సాగు..

జిల్లాలో ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే వర్షాలు విస్తారంగా కురిశాయి. దీంతో ఎన్నో ఆశలతో అన్నదాతలు ఆరుతడి పంటలైన మినుము, జొన్న, పత్తి, వేరుశనగ, పొద్దుతిరుగుడు పంటలు సాగుచేశారు. సాగు చేసిన 40 రోజుల తరువాత వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో జిల్లాలోని ఎర్రగుంట్ల, కమలాపురం, వల్లూరు, వీరపునాయునిపల్లి, పెండ్లిమర్రిలతోపాటు పలు మండలాల పరిధిలో సాగు చేసిన మినుము పంట ఎండు ముఖం పట్టింది. దీంతో చేసేదేమీలేక చాలామంది రైతులు మినుము పంటను నిలువునా దున్నేశారు. అరకొరగా ఎండుముఖం పట్టిన మిగతా పంటలను అలాగే పొలంపైనే వదిలేశారు. దీంతో వేలకు వేలు పెట్టుబడి నేలపాలైంది. తరువాత అప్పుడప్పుడు కురిసిన వర్షాలకు అక్కడక్కడా పంటలు పచ్చగా మారినా అనుకున్న మేర దిగుబడులు రాక చివరకు అన్నదాతల ఆశలు అడియాసలుగానే మిగిలి నష్టాలను మూటగట్టుకోవాల్సి వచ్చింది.

సాగు సాయం సకాలంలో అందక..

ఖరీఫ్ ఆరంభంలోనే గత ప్రభుత్వం రైతన్నలకు రైతు భరోసా నిధులను విడుదల చేసింది. దీంతో చాలా మంది రైతులు పంటల సాగుకు అప్పులు చేయకుండా ఆరుతడి పంటలను సాగు చేసుకున్నారు. అలాంటిది కూటమి ప్రభుత్వం రైతన్నలకు అందిస్తామన్న అన్నదాత సుఖీభవ నిధులను సకాలంలో అందించకపోవడంతో చాలా మంది రైతులు ఖరీఫ్ పంటల సాగుకు అప్పులు చేయాల్సి వచ్చిందని పలువురు రైతులు తెలిపారు. పోనీ అప్పులు చేసి సాగు చేసిన ఆరుతడి పంటలు కూడా వర్షాభావంతో ఎండిపోయి చివరకు దిగుబడులు దుక్కిపాలై అప్పులే మిగిలాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

గత ప్రభుత్వం ఆరంభంలోనే పెట్టుబడి సాయం..

రైతులు పంటల సాగు కోసం ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖరీఫ్ ఆరంభంలోనే పెట్టుబడి సాయం (వైఎస్సార్ రైతు భరోసా) అందించి అన్నదాతలకు అండగా నిలిచింది. ఏటా క్రమం తప్పకుండా ఈ మొత్తాన్ని అందించింది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి సాయం కింద రూ. 6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ. 7500 మొత్తం కలిపి ఏడాదికి రూ. 13500 రైతు ఖాతాలకు జమ చేసేది. ఈ మొత్తాన్ని మూడు విడతల్లో రైతు ఖాతాలకు జమ చేసేది. ఇందులో ఖరీఫ్ ఆరంభంలో, రెండవది కోతల సమయంలో, మూడవది ధాన్యం ఇంటికి చేరే వేళ ఇలా రైతుల ఖాతాలకు జమ చేసేవారు. ఇలా వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ కింద ఐదేళ్లపాటు రూ. 1191.03 కోట్లను అన్నదాతలకు అందించి అండగా నిలిచింది.

గత ఐదేళ్లలో వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ సమ్మాన్ కింద విడుదలైన నిధుల వివరాలు ఇలా..		
సంవత్సరం	రైతుల సంఖ్య	విడుదలైన నిధులు (రూ.కోట్లలో)
2019-20	206708	279.93
2020-21	208747	280.06
2021-22	199344	269.11
2022-23	202598	235.68
2023-24	210481	126.25

కూటమి ప్రభుత్వంలో..

ప్రస్తుత కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు ఏడాదికి రాష్ట్ర వాటా కింద రూ. 14 వేలు అందిస్తామని ప్రకటించింది. అంటే ఏడాదికి కేవలం రాష్ట్ర ప్రభుత్వం అందించే అన్నదాత సుఖీభవ పథకం కింద జిల్లా రైతాంగానికి రూ. 294.67 కోట్లు అందనుంది. అలాగే గత ప్రభుత్వం కంటే అదనంగా ప్రతి రైతుకు ఏడాదికి రూ. 6500 చొప్పున అందనుంది. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా 210481 మంది రైతులకు ఏడాదికి అదనంగా రూ.136.81 కోట్లు అందనుంది. అంటే జిల్లా రైతాంగానికి రైతు భరోసా, పీఎం కిసాన్ రెండు కలిపి ఏడాదికి రూ. 431.48 కోట్లు అందించాల్సి ఉంది.

పీఎం కిసాన్ వచ్చినా..

కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నుంచి తొలివిడత సాయంగా జూన్ 18వ తేదీన ప్రతి రైతుకు రూ. 2 వేల చొప్పున ఖాతాలకు నగదు జమ చేసింది. దీంతో వైఎస్సార్ జిల్లాలో 1,85,607 మంది రైతులకు రూ. 37.36 కోట్లు రైతు ఖాతాలకు లబ్ధి చేకూరింది. దీంతో రైతులు తమ పంటల సాగుకు ముందుగా అవసరమైన విత్తనాల కొనుగోలుకు కాసింత సాయపడింది. ఇక రాష్ట్ర ప్రభుత్వ సహాయం కోసం జిల్లా రైతాంగం ఎదురు చూస్తోంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అన్నదాత సుఖీభవ నిధులను విడదల చేయాల్సిన అవసరం ఉంది.

రైతులంటే చిన్న చూపు తగదు



కూటమి ప్రభుత్వానికి రైతులంటే చిన్నచూపు తగదు. అహర్నిశలు కష్టపడి పంటలు పండించే రైతులను ఆదుకునే విషయంలో టీడీపీ ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. ఖరీఫ్‌లో సరైన వర్షాలు లేక సాగు చేసిన ఆరుతడి పంటలు చాలా మేర ఎండిపోయాయి. దీంతో చాలామంది రైతులు నష్టపోయారు. వీరిని ఆదుకునే విషయంలో పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోంది. దీనికి తోడు అన్నదాత సుఖీభవ నిధులను కూడా విడుదల చేయలేదు. అటు నష్టపరిహారం లేక ఇటు సుఖీభవ నిధులు రాక అన్నదాతలు అప్పుల ఊబిలోకి వెళుతున్నారు. – మురళీమోహన్‌రెడ్డి, సుంకేసుల, ఖాజీపేట

అన్నదాతలను ఆదుకోవాలి



ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు లేక పంటలు దెబ్బతిన్న రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి. దీంతో పాటు రబీ సీజన్ సాగుకు సంబంధించిన విత్తనాలను అన్నదాతలకు ఉచితంగా అందించాలి. అలాగే అన్నదాత సుఖీభవ నిధులను వెంటనే విడుదల చేయాలి. ఆ డబ్బులతోనైనా అన్నదాతల రబీ సీజన్‌కు సంబంధించిన సేద్యాలు, ఎరువుల కొనుగోలే వంటి కార్యక్రమాలు చేసుకునే వెసులుబాటు ఉంటుంది. – దస్తగిరిరెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి

మహిళా పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

– జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు

కడప అర్బన్ : మహిళా పోలీస్ సిబ్బంది వారి కుటుంబాలలోని మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు సూచించారు. గురువారం సాయంత్రం స్థానిక ఉమేష్ చంద్ర కళ్యాణ మండపంలో మూడు రోజులుగా విజయవాడ మణిపాల్ హాస్పిటల్స్ సహకారంతో ఏర్పాటు చేసిన రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ ఉచిత స్క్రీనింగ్ పరీక్షల ముగింపు కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. క్యాంప్ ఏర్పాటుకు సహకరించిన మణిపాల్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడికి, రేడియేషనల్ ఆంకాలజిస్ట్ స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్ శ్రీదివ్య, రామ్ చక్రవర్తి, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు, అదనపు ఎస్పీ (ఏ.ఆర్) ఎస్.ఎస్.వి కృష్ణారావు, పోలీస్ సంక్షేమ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ మేరీ సుజాత, ఏ.ఆర్. డీఎస్పీ మురళీధర్, ఆర్ఐలు, ఆనంద్, టైటస్, వీరేష్, శ్రీశైల రెడ్డి, ఆర్ఎస్ఐలు, మహిళా పోలీస్ సిబ్బంది హోంగార్డులు, డీపీఓ సిబ్బంది వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫెన్సింగ్ పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక జార్జ్ కారొనేషన్ క్లబ్‌లో గురువారం జిల్లా స్థాయి ఎస్జీఎఫ్ఐ ఫెన్సింగ్ పోటీలను నిర్వహించారు. అండర్-14, 17 బాలబాలికలకు నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 100 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులను అక్టోబర్‌లో నంద్యాలలో జరగనున్న రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక చేశారు. ఈ పోటీలను ఎస్జీఎఫ్ఐ జిల్లా సెక్రటరీ అరుణకుమారి, జార్జ్‌క్లబ్ సెక్రటరీ పురుషోత్తం రెడ్డి, జాయింట్ సెక్రటరీ ఈశ్వరరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు రాఘవ, శివారెడ్డి, షేక్ అల్లాబకాష్ తదితరులు పర్యవేక్షించారు.

ఆత్మహత్యకు యత్నించిన పూజారి మృతి



రామానుజాచార్యులు(ఫైల్)

ప్రొద్దుటూరు కల్చరల్ : ఈ నెల 20వ తేదీన ఆత్మహత్యాయత్నం చేసిన పూజారి వీణా రామానుజాచార్యులు (58) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. శివాలయం వీధిలోని దత్తాత్రేయ స్వామి ఆలయంలో పూజారిగా పనిచేస్తున్న రామానుజాచార్యులు ఆలయంలోనే విషద్రావణం తాగాడు. కుటుంబ సభ్యులు కర్నూలులోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. తన భర్త మృతికి ఆలయ ఈఓ రామచంద్రాచార్యులు కారణమని పూజారి భార్య తీర్థపాటి పుష్ప టుటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

తైక్వాండో ఎంపికలకు విశేష స్పందన

కడప స్పోర్ట్స్ : పాఠశాల క్రీడాసమాఖ్య (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో గురువారం కడప నగరంలోని వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి తైక్వాండో ఎంపికలకు విశేష స్పందన లభించింది. అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో నిర్వహించిన ఈ ఎంపికలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు హాజరయ్యారు. తైక్వాండో అసోసియేషన్‌లో ఉన్న గ్రూపుల కారణంగా ఎంపికల ప్రక్రియలో ప్రతి చిన్న అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించడంతో వాగ్వాదం చేసుకున్నారు. కాగా ఓ ప్రైవేట్ శిక్షకుడు మద్యం సేవించి ఎంపికలకు రావడంతో పాటు నానా రభస సృష్టించాడు. పోలీసుల రంగ ప్రవేశంతో వ్యవహారం సద్దుమణిగి ఎంపికలు ప్రశాంతంగా నిర్వహించారు. ఈ విషయమై ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారిని వివరణ కోరగా.. తైక్వాండో క్రీడకు జిల్లా వ్యాప్తంగా పెద్దసంఖ్యలో క్రీడాకారులు, శిక్షకులు ఉన్న నేపథ్యంలో గురువారం ఎంపికల్లో కాస్త గందరగోళం తలెత్తిందన్నారు. వెంటనే స్పందించి ప్రశాంతంగా ఎంపికలు సాగేలా చూశామని తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సాజిత్, మహమ్మద్ బాషా, శిక్షకులు విజయభాస్కర్‌రెడ్డి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా తైక్వాండో జట్టుకు ఎంపికైన క్రీడాకారులు..

అండర్-14 బాలికలు : రిజ్వాన, డి. త్రివేణి, పద్మావతి, వింధ్యశ్రీ, పూజిత, రెడ్డిహర్షిత, కె. త్రివేణి, నాగశరణ్య, హర్షిత, సోహిత.

అండర్-17 బాలికలు : హలీమసాదియ, లాససారా, అనీషా, అకిల, అక్షయ, అక్సా, మహితారెడ్డి, ఐశ్వర్య, లక్ష్మిసరయు, సుమయ, అమృత.

అండర్-14 బాలురు : రయాన్, విశ్వసుందర్‌రాజ్, నాగసాత్విక్, భరత్, హర్షవర్ధన్‌రెడ్డి, ఇబ్రహీం, జహీర్, పవన్‌కుమార్, కిజార్.

అండర్-17 బాలురు : అబుబకర్, విష్ణు, గురుధాత్రిన్, అస్లాం, ఆసిఫ్, ప్రణయ్‌కుమార్, సాయిశ్రవణ్, అజీత్, అమర్‌నాథ్, అబుబకర్‌సిద్ధిఖ్, చరణ్‌కుమార్‌రెడ్డి, హరినాథ్, చరణ్.

హత్య కేసులో నిందితులకు జైలు శిక్ష

వేంపల్లె : హత్య కేసులో ఇద్దరు నిందితులకు జైలు శిక్షతోపాటు జరిమానా విధించినట్లు సీఐ సురేష్ రెడ్డి వెల్లడించారు. గురువారం వేంపల్లె పోలీసు స్టేషన్‌లో మీడియాతో మాట్లాడుతూ 2016వ సంవత్సరంలో వేంపల్లి మండలం పాములూరు గుట్టలో గుర్తు తెలియని మగ శిశువు మృతి చెందడంతో అప్పటి పాములూరు వీఆర్ఓ సునీల్ ఫిర్యాదు చేశారు. ఈ కేసును డీఎస్పీ వాసుదేవన్ దర్యాప్తు చేశారు. పులివెందుల కోర్టులో అడిషనల్ జడ్జి వెంకటేశ్వరరావు ఎదుట పబ్లిక్‌ప్రాసిక్యూటర్ ఖదిరున్నిసా వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో పులివెందులకు చెందిన బత్తిన మల్లేశ్వరికి ఏడాది జైలు శిక్ష, జరిమానా అలాగే బత్తల చిన్నకు మూడేళ్ల జైలు శిక్ష జరిమానా విధించారు.

అటవీ భూమిని నిగ్గు తేలుస్తారా..!

- ముమ్మరంగా రెవెన్యూ, అటవీశాఖ జాయింట్ సర్వే
- ఫారెస్ట్ గెజిట్‌లో 1044 ఎకరాల అటవీభూమి ఉండగా..
- రెవెన్యూ రికార్డుల్లో 902 ఎకరాలు మాత్రమే ఉన్న వైనం



ప్రొద్దుటూరు రేంజ్ పరిధిలో సర్వే నిర్వహిస్తున్న అటవీ, రెవెన్యూ అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : అన్యాక్రాంతమైన భూమిని నిగ్గు తేల్చేందుకు అటవీ, రెవెన్యూ అధికారులు సిద్ధమయ్యారు. గెజిట్‌లో కంటే సుమారు 140 ఎకరాల అటవీభూమి తగ్గడంతో అధికారులు ఈ సర్వే చేపట్టారు. ప్రొద్దుటూరు రేంజ్ పరిధిలో సుమారు 1044 ఎకరాల ఫారెస్ట్ భూమి ఉండాలని అధికారిక గెజిట్‌లో ఉంది. అయితే రెవెన్యూ రికార్డుల్లో 904 ఎకరాలు అటవీ భూమి మాత్రమే చూపిస్తోంది. దీంతో రూ. కోట్లు విలువైన భూమి పెద్ద ఎత్తున అన్యాక్రాంతమైనట్లు లోకాయుక్తకు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో అటవీ భూమిలో జరిగిన ఆక్రమణలను తొలగించాలని కోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులతో కలిసి అటవీ అధికారులు జాయింట్ సర్వే నిర్వహిస్తున్నారు. అటవీ భూమిని నిగ్గు తేల్చేందుకు రెండు శాఖలు సంయుక్తంగా ఈ సర్వే చేస్తున్నాయి.

పోట్లదుర్తి, రామేశ్వరం రిజర్వ్ ఫారెస్ట్‌లోనే ఎక్కువగా వ్యత్యాసం

ఎర్రగుంట్ల మండలంలోని పోట్లదుర్తి, ప్రొద్దుటూరు రామేశ్వరం రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉండాల్సిన అటవీ భూమిలో ఎక్కువ వ్యత్యాసం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రొద్దుటూరు ఎఫ్ఆర్ఓ హేమాంజలి ఆధ్వర్యంలో ల్యాండ్ సర్వే వారం రోజుల క్రితం ప్రారంభించారు. రామేశ్వరంలో సర్వే పూర్తి అయిందని గురువారం నుంచి మోడమీదిపల్లె ప్రాంతంలో సర్వే చేపట్టినట్లు ఎఫ్ఆర్ఓ తెలిపారు. రోగర్, జీపీఎస్ సాయంతో మార్కింగ్ వేసుకుంటూ అధికారులు సర్వే చేస్తున్నారు. సర్వే పూర్తి అయ్యాక నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని ప్రొద్దుటూరు ఎఫ్ఆర్ఓ హేమాంజలి తెలిపారు. ప్రస్తుతం మోడమీదిపల్లె ప్రాంతంలో సర్వే చేపట్టామని తెలిపారు.

అన్ని అనుమతులున్నా కూల్చివేయడం అన్యాయం

– కలెక్టర్‌తో వైఎస్సార్‌సీపీ నేతలు




కలెక్టర్ శివశంకర్ లోతేటితో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని రామాంజనేయపురంలో సర్వే నంబర్ 424/4లో శ్రీబాలాజీ డెవలపర్స్‌కు చెందిన లే అవుట్‌లో ప్రహరీ కూల్చివేయడం అన్యాయమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. గురువారం వారు కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ శివశంకర్ లోతేటిని కలిసి బుధవారం జరిగిన సంఘటనను వివరించారు. శ్రీ బాలాజీ డెవలపర్స్‌లో వైఎస్సార్‌సీపీ నేత ఏ. బాలక్రిష్ణారెడ్డి పార్టనర్‌గా ఉన్నరనే కక్షతోనే టీడీపీ నాయకులు ఇలా చేయించారని ఆరోపించారు. రెవెన్యూ రికార్డుల్లో ఎక్కడా కెనాల్ లేకపోయినా తమ పార్టీ నేతలను వేధించేందుకే ఇలా చేస్తున్నారని చెప్పారు. భూమిని సబ్ డివిజన్ చేసి సేల్‌డీడ్ చేసినప్పటి నుంచి ల్యాండ్ కన్వర్షన్ చేసి, ప్లాన్ అప్రూవల్ తీసుకునే వరకూ అన్ని సవ్యంగానే జరిగాయని, అప్పుడు ఎవరూ కెనాల్ ఉందని అభ్యంతరం లేవనెత్తలేదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, ఏపీ సోషల్ వెల్ఫేర్‌బోర్డు మాజీ చైర్మన్ పులి సునీల్, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు యానాదయ్య, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

29న విద్యావంతుల వేదిక మహాసభలు

కడప ఎడ్యుకేషన్ : ఈ నెల 29వ తేదీన ప్రొద్దుటూరులో రాయలసీమ విద్యావంతుల వేదిక 4వ రాష్ట్ర మహాసభలను నిర్వహించనున్నట్లు రాయలసీమ విద్యావంతుల వేదిక , రాయలసీమ విద్యార్థి సమాఖ్య, నాయకులు తెలిపారు. గురువారం కడప ప్రెస్‌క్లబ్‌లో మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాయలసీమ విద్యావంతుల వేదిక జిల్లా కమిటీ సభ్యులు చంద్ర మౌళీశ్వర్ రెడ్డి , పుత్తా శివారెడ్డి మాట్లాడుతూ రాయలసీమ వ్యక్తులు ముఖ్యమంత్రులైనా ఈ ప్రాంతం అన్యాయానికి గురవుతోందన్నారు. రాయసీమ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి మల్లేల జగదీష్, బుద్దిస్టు కల్చర్ సొసైటీ సభ్యుడు కుమార స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు .

అక్టోబర్ 1న బద్వేలులో బహిరంగ సభ



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలో విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమించి సొమ్ము చేసుకుంటున్న భూ మాఫియా అక్రమాలకు అడ్డుకట్ట వేసి అర్హులైన పేదలకు పంచాలని కోరుతూ అక్టోబర్ 1న బద్వేలులో భారీ ప్రదర్శన బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర తెలిపారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అర్హులైన పేదలకు రెండు సెంట్ల ఇంటి స్థలం, రెండెకరాల సాగు భూమి పంచేందుకు నిరాకరిస్తున్న అధికారులు, అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు విలువైన ప్రభుత్వ భూములపై తప్పుడు పత్రాలను సృష్టించి ఆక్రమించి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. ఈ బహిరంగ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఓబులేసు, ఈశ్వరయ్య హాజరవుతున్నట్లు తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు బి.రామయ్య, ఎస్.వెంకటశివ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ జిల్లా జట్లు ఎంపిక



జిల్లా హ్యాండ్‌బాల్ బాలుర జట్టు

కడప స్పోర్ట్స్ : పాఠశాల క్రీడాసమాఖ్య (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఎస్జీఎఫ్ హ్యాండ్‌బాల్ జిల్లాస్థాయి ఎంపికలకు క్రీడాకారుల నుంచి చక్కటి స్పందన లభించింది. కడప నగరంలోని డీఎస్ఏ మైదానంలో నిర్వహించాల్సిన ఈ ఎంపికలను గండి రెసిడెన్షియల్ పాఠశాల మైదానంలో నిర్వహించారు. ఎంపికలను ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని సూచించారు. అనంతరం ఎంపికలు నిర్వహించి అండర్-14, అండర్-17 బాలబాలికల జట్లను ప్రకటించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ప్రవీణ్‌కిరణ్, రాజశేఖర్, విజయభారతి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు..

అండర్-14 బాలికలు : సుమశ్రీ, కీర్తన, లయ, దివ్య, ప్రమీల, నందిని, ఆఫీఫా, గగన, ఆఫీషా, నాగలత, మేఘన, హరిణి, బిందు, జోత్స్న, సమీర, మేఘన.

అండర్-17 బాలికలు : జయశ్రీ, యమున, పల్లవి, ఆయేషా, చంద్రిక, వాణి, కావ్యశ్రీ, సాత్విక, హర్షిత, భానుశ్రీ, ధరణి, శ్రీకళ, దాక్షాయణి, సాహిత్య, షాహిద, తస్లీం.

అండర్-14 బాలురు : గణేష నిఖిల్, మహమ్మద్ సోహిల్, కల్యాణ్‌రాజు, సమీర్, వెంకటజయంత్, హేమసుందర్, ప్రశాంత్‌కుమార్, బన్నీ, మజీద్, వరుణతేజ్, జనార్దన్, చంద్రశేఖర్, ఆనంద్, చిన్నకుల్లాయస్వామి, రేవంత్‌కుమార్‌రెడ్డి.

అండర్-17 బాలురు : వెంకటసాయిరామ్, రెడ్డిసాయి, గణేష్, హర్షవర్ధన్, మహమ్మద్ ఆజాద్, గౌతమ్‌రాజ్, జయసింహారెడ్డి, అనిల్‌కుమార్, బాబా ఫక్రుద్దీన్, విష్ణువర్ధన్, అజయ్‌కుమార్, ఆదిరెడ్డి, పునీత్‌కుమార్, సాయి, ఈశ్వర్, వెంకటమోహన్.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ ఆర్చరీ ఎంపికలు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో గురువారం నిర్వహించిన ఎస్జీఎఫ్ జిల్లా స్థాయి ఆర్చరీ ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. ఎంపికలను ఫిజికల్ డైరెక్టర్ ఎల్. వెంకటలక్ష్మి, క్రీడా పాఠశాల ఆర్చరీ శిక్షకుడు రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అండర్-14, అండర్-17 బాలబాలికలకు ఇండియన్ రౌండ్, రికర్వ్ రౌండ్, కాంపౌండ్ రౌండ్ విభాగాల్లో ఎంపికలు నిర్వహించి జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు తెలిపారు.

అండర్-14 బాలురు..

ఇండియన్ రౌండ్ : జి. సిద్ధార్థ, ఎస్. శశివర్ధన్, ఎల్.కౌషల్ దేవరాయల్, టి. గణేష్.

రికర్వ్‌రౌండ్ : డి. నాగచైతన్య, సి.శ్రీహరిచరణ్, పి. కిరణ్, సి.సాయిహర్ష.

కాంపౌండ్ రౌండ్ : సి. అభినయ్, ఎస్. ముస్తాఫా, ఎస్.వి.హేమంత్, సి.వి. మహీధర్.

అండర్-14 బాలికలు..

ఇండియన్ రౌండ్ : కె.నవ్యశ్రీ, వి.మధులిక, కె.గురుగౌతమి, బి. కీర్తన.

రికర్వ్‌రౌండ్ : ఎస్. త్రివేణి, ఎస్. ఆరీఫా, జి.వైష్ణవి, ఎ. గీతిక.

కాంపౌండ్ రౌండ్ : ఎం. కాత్యాయని, ఎం. రీనాతేజశ్విని, జి.ప్రణీత, ఎం.గోపిప్రియ.

అండర్-17 బాలురు..

ఇండియన్ రౌండ్ : ఎ. యశ్వంత్‌రెడ్డి, ఎ. విశాల్, సి. దినేష్‌కుమార్, కె. అరవింద్.

రికర్వ్ రౌండ్ : ఆర్. వ్యోమోకేష్, ఇ. హరిపెంచల్, ఎస్. శివకృష్ణ, పి. జతిన్.

కాంపౌండ్‌రౌండ్ : పి.వి. సాయిశ్రీనివాస్, ఎస్. రాకేష్, ఎస్.జె.కార్తీక్, డి.మేఘవర్ధన్.

అండర్-17 బాలికలు..

ఇండియన్ రౌండ్ : ఇ. శివదుర్గ, టి. సుశ్రుత, జి. సుజిత, బి. సమిత.

రికర్వ్ రౌండ్ : డి. శ్యామల, పి.దీక్షిత, జి.హారిక, ఎ. రీతిక.

కాంపౌండ్ రౌండ్ : ఎస్.జె. గీతిక, ఎస్.నవనీత, జి.ప్రణవి, ఎస్. మాధవి.